యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఎస్‌ఐ రమేష్ నాయుడు

విశాలాంధ్ర - తెర్లాం : మండలం పెరుమాలి మోడల్ స్కూల్ నందు మండల మండల స్థాయి కార్యక్రమం నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ క్రమంలో ఎస్ఐ రమేష్ నాయుడు మాట్లాడుతూ యువత లక్ష్యం ఏర్పరుచుకుని ఆ వైపు ప్రయాణించాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని భవిష్యత్ లో ఉన్నత స్థాయిలో ఉండాలి అంటే ఇప్పటినుండే లక్ష్యం పెట్టుకుని చేరుకోవాలని తెర్లాం ఎస్ఐ రమేష్ నాయిడు అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ స్టాఫ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించండి : జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లాలో కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలో వ్యాధి వ్యాప్తికి కారణాలను గుర్తించి, వాటిని నివారించాలని సూచించారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా, ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో కుష్టువ్యాధి వ్యాప్తి చెందడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా వ్యాధిని చాలావరకు అరికట్ట వచ్చునని, వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించవచ్చునని సూచించారు. దీనికోసం వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఈ వ్యాధి కారణాలు, చికిత్స, నివారణా చర్యలను ప్రజలకు వివరించాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ పాఠశాలలో ప్రతీ విద్యార్థినీ తనిఖీ చేసి, స్పర్శ లేని మచ్చలు, ఇతర లక్షణాలు ఏమైనా ఉంటే గుర్తించాలన్నారు. కుష్టువ్యాధిని ముందుగానే గుర్తించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించ వచ్చునని, అలాగే ఈవ్యాధిని ఎండిటి చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చునని సూచించారు. జిల్లాలోని ప్రతీ ఇంటిలో సర్వే జరగాలని స్పష్టం చేశారు. కేవలం మన ప్రాంతంలోనే ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువగా ఉండటానికి తగిన శాస్త్రీయ కారణాలను అన్వేషించాలని సూచించారు. జిల్లా ఆసుపత్రులు కూడా తమవద్దకు వచ్చే రోగుల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి, చికిత్స అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సర్వే కోసం ఇంటివద్దకు వచ్చే ఆశావర్కర్లు, వైద్య సిబ్బందికి ప్రజలు పూర్తిగా సహకరించాలని, తమ దేహంపై స్పర్శలేని మచ్చలు, వ్యాధి ఇతర లక్షణాలు ఏమైనా ఉంటే వివరాలను వారికి తెలియజేసి, కుష్టురహిత జిల్లాగా మార్చేందుకు తమవంతు సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా కుష్టు నియంత్రణాధికారి డాక్టర్ రాణి, జెడ్‌పి సిఇఓ శ్రీధర్‌రాజా, డిఇఓ ఎన్.ప్రేమ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, మెప్మా పిడి సుధాకరరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పుట్టినరోజు శుభాకాంక్షలు

వైసీపీ సీనియర్ నాయకులు రొంగలి కనక సింహాచలం

విశాలాంధ్ర - డెంకాడ : డెంకాడ గ్రామం వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు రొంగలి కనక సింహాచలం మంగళవారం మాజీ మంత్రి బొత్స సత్య నారాయణ పుట్టినరోజు సందర్భంగా స్వయంగా మాజీ మంత్రిని కలిసి పుష్పగుచ్చం ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉచిత ఇసుక విధానం వల్ల ప్రజలకు ఎంతో మేలు

మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు

విశాలాంధ్ర - గజపతినగరం : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు అన్నారు మంగళవారం గజపతినగరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులు నిర్మాణరంగం కుదేలైంది అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దశలవారీగా హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు అలాగే గృహ నిర్మాణ లబ్ధిదారులు సొంతింటి కల నెరవేరలేదని వైసిపి ప్రభుత్వం ఇసుక విధానం వల్ల ఉపాధి కోల్పోయిన లక్షలాది భవనిర్మాణ కార్మికులకు మళ్లీ ఉపాధి లభించిందన్నారు ఈ సమావేశంలో గంట్యాడ మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు గజపతినగరం మాజీ జెడ్పిటిసి మక్కువ శ్రీధర్ మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి దత్తిరాజేరు మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ జామి మండల పార్టీ అధ్యక్షులు పోలిపర్తి స్వామి నాయుడు టిడిపి నాయకులు పీవీవి గోపాల్ రాజు అర్జున్ మహేశ్వరరావు లంక బంగారు నాయుడు పొట్నూరు అప్పల రామ్ తదితరులు పాల్గొన్నారు

లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

నగరపాలక కమిషనర్ ఎంఎం.నాయుడు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం ఎం నాయుడు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం 24 వ డివిజన్ ప్రాంతంలో పర్యటించి అక్కడ నెలకొన్న సమస్యలను గుర్తించారు. ముఖ్యంగా అక్కడ ఉన్న ప్రధాన కాలువలో నీరు ప్రవహించ నిలిచి పోవడంతో మురుగనీరు రోడ్లపైకి రావడానికి గమనించారు. తక్షణం సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. అలాగే సమస్య తీవ్రతరం అవుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన శానిటరీ కార్యదర్శి, పారిశుధ్య సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి నిర్లక్ష్య ధోరణి పునరావృతం అయితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు కాలువ తీవ్రతను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి నీరు ప్రవహించే విధంగా చేస్తామని కమిషనర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తుగా గుర్తించి వాటిని సరిచేయాలని అన్నారు. రాబోయే రోజుల్లో కురిసే వర్షాలకు లోతట్టు ప్రాంతాలు, ప్రధాన కాలువలు చెత్తలతో పేరుకుపోవడం వల్ల తీవ్రమైన సమస్యలు ఎదురవుతాయని అన్నారు.వర్షపు నీరు అధికమైన పరిస్థితుల్లో ముంపు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. కావున వాటిని తక్షణమే గుర్తించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించామన్నారు. వీధులలోని కాలువలలో మురుగు నిలిచిపోకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు.

శత శాతం ఆస్తి పన్నుల వసూలుకు చర్యలు చేపట్టండి

మున్సిపల్ ప్రాంతీయ సంచాలకులు జి.నాగరాజు

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణంలో శత శాతం ఆస్తి పన్నులు వసూలుకు ప్రత్యేక దృష్టి సారించాలని పురపాలకగా ప్రాంతీయ సంచాలకులు జి నాగరాజు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ను ఆదేశించారు. పురపాలక సంఘాన్ని పురపాలక ప్రాంతీయ సంచాలకులు జి.నాగరాజు సందర్శించారు.అనంతరం పురపాలక సంఘ కార్యాలయంలో అన్ని సచివాలయాల వార్డు అడ్మిన్ సెక్రటరీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, పర్యావరణ ఇంజనీరు ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, రెవెన్యూ ఆఫీసర్ మరియు మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి తో సమావేశం నిర్వహించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్. జి.టి) మార్గదర్శకములను అనుసరించి వార్డులలో తడి చెత్త పొడి చెత్త సేకరణ, సేకరించిన వెంటనే శాగ్రిగేషన్ చేయుట, కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుట మరియు డీసిల్టేషన్ చేయించాలని, ప్రస్తుతం ఉన్న వర్షాకాలం దృష్ట్యా ఎక్కడ కాలువలు బ్లాక్ అవ్వకుండా చూసుకోవాలని, బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటిని వెంటనే తొలగించాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. అపార్ట్మెంట్లు మరియు గ్రూప్ హౌస్ ల వద్ద ఉత్పత్తి అవుతున్న చెత్తను ఆన్ సైట్ కంపోస్టింగ్ ద్వారా చెత్త నుండి ఎరువులు తయారు చేయుట గురించి ప్రజలకు అవగాహన కల్పించి, ఆన్ సైట్ కంపోస్టింగ్ జరిగేలా చూడాలని తెలియజేశారు. తదుపరి కార్యాలయ రెవెన్యూ సిబ్బందితో ఇంటి పన్నులు, కులాయి పన్నులు, మరియు ఖాళీ స్థలముల పన్నులు వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించి ఇంకను వసూలు చేయవలసిన బకాయిలు ఎక్కువగా ఉన్నందున ఇప్పటినుండి రోజువారి టార్గెట్ లను నిర్దేశించి ప్రతిరోజు వసూలు చేయాలని ఆదేశించారు.

ఉచిత ఇసుక పాలసీ అభినందనీయం: ఎమ్మెల్యే కళావెంకటరావు

విశాలాంధ్ర - చీపురుపల్లి : కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావటం అభినందనీయమని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. మంగళవారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీ అనేది 'రాష్ట్ర ప్రగతికి' బాట అని చెప్పుకొచ్చారు. పేదల సొంతింటి కల నెరవేరనుందని భవన నిర్మాణ రంగం ఊపందుకుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే అమల్లోకి తెచ్చారని ఆయన అన్నారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియాను నడిపిందని ఒక్క ఇసుక కుంభకోణం ద్వారానే రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని వైసీపీ నేతలే స్వయంగా ఇసుకాసురు అవతారం ఎత్తి దోచుకున్నారని అన్నారు. పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఖర్చు అయితే అందులో ఇసుక కొనడానికే రూ. 3 లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉండేదని కిమిడి అన్నారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేశారని ఆయన అన్నారు. జగన్ బినామీ సంస్థ జేపి వెంచర్స్ చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ.800 కోట్లు మినహాయించి ప్రజాధనాన్ని ధారధత్తం చేశారన్నారు. వైసీపీ నేతలు మింగేసిన ఇసుకతో దాదాపు పది లక్షలకు పైగా ఇళ్ల కట్టొచ్చంటే వారి అవినీతి ఏ స్థాయిలో అవినీతి చేశారో అర్థం చేసుకోవచ్చు అని ఆయన వివరించారు.

వీర జవానుకు ఘన నివాళి

జవాను కుటుంభ సభ్యులకు భరోసా కల్పించిన పోలీసులు

విశాలాంధ్ర - గరివిడి : 2007 సంవంత్సరం జులై నెలలో చతీష్ ఘడ్ రాష్ట్రం, దంతేవాడా జిల్లా లో నక్షల్స్ జరిపిన దాడిలో గరివిడి పట్టణం, టీచర్స్ కాలనీ కి చెందిన సిఆర్‌పిఎఫ్ కమాండో కె. గోవింద రావు అమరులైనారు. ఈ విషాద సంఘటన జరిగి నేటికీ 18 సంత్సరాలు అయినందున, సదరు సంఘటనలో అమరులైన వారందరిని స్మరించుకొనుటుకు గాను సి.ఆర్. పి.ఎఫ్ డీజీ ఆదేశాలు మేరకు వారి యొక్క బేటాలియన్ కీ చెందిన ఏ.ఎస్.ఐ గంగిరెడ్డి, విజయనగరం జిల్లా ఎస్ పి ఉత్తర్వులు మేరకు గరివిడి ఎస్ ఐ యల్. దామోదరరావు తో పాటు వారి స్టేషన్ సిబ్బంది అయినా ఏఎస్ఐ రమణ, ఆరి, కానిస్టేబుల్ యల్. పైడితల్లి, యూ.ఆనంద్ కలిసి అమరులైన గోవిందరావు కుటుంబ సభ్యులు అయినటువంటి భార్య సుజాత, అతని పిల్లలు వారి యొక్క బాగోగులు తెలుసుకొని, వారికి ఎటువంటి సమస్యలు ఉన్న తెలియపరచమని పోలీస్ సిబ్బంది భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అయినటువంటి ఎస్.త్రినాథ్, వై.ఎస్ అప్పలనాయుడు, మూర్తి మరియు సోషల్ సర్వీస్ మండల ప్రెసిడెంట్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఎంటిఆర్ ఫుడ్స్ 100వ సంవత్సరం వేడుకలు

విశాలాంధ్ర - రాజాం : వ్యాపారరంగంలో ప్ర ముఖ సంస్థగా ఖ్యాతి గడించిన ఎంటిఆర్ వందవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సంద ర్భంలో రాజాంలో మంగళ వారం కుకింగ్ మరియు కేటరింగ్ అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమావేశం జరిగింది. సుమారు 120 మంది హాజ రయ్యారు. వారికి ఎంటిఆర్ ప్రోడక్ట్స్ గూర్చి నిర్వాహకులు వివరించారు. శ్రీకృష్ణ ఏజెన్సీ అధినేత గ్రంధి తాతాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

మాధవమ్మను విమర్శించే స్థాయి బడ్డుకొండకు లేదు : కాకర్లపూడి శ్రీనివాసరాజు

విశాలాంధ్ర - భోగాపురం : సూర్యోదయమే చూడని బద్ధకపు బడ్డుకొండ అవిశ్రాంతంగా ప్రజలకోసం పనిచేస్తున్న మాధవమ్మను విమర్శించడం విడ్డురంగా ఉందని జనసేన నాయకుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు ఎద్దేవా చేసారు. మంగళవారం అయన స్వగృహంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడుతూ మాధవమ్మను విమర్శించే స్థాయి బడ్డు కొండకు లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రోటో కాల్ ను తుంగలో తొక్కి ఇప్పుడు ప్రోటో కాల్ కోసం మాట్లాడం హాస్యా స్పదంగా ఉందన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ ప్రజలందరూ బడ్డుకొండను ఛీ కొట్టి ఇంటికి పంపించారని అన్నారు. ప్రభుత్వ హయాంలో కబ్జా చేసిన కొండలన్నీ ఏడుస్తున్నాయని, బొడ్డుకొండ అక్రమాలన్నీ వెలికి తీస్తామని అన్నారు. అవాకులు, చెవాకులు మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు. ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నత మైన ఆశయాలు,ఆలోచనల మేరకు ఎమ్మెల్యే మాధవమ్మ నెల్లిమర్ల నియోజక వర్గంలో అభివృద్ధి చేస్తారని అన్నారు. ఎమ్మెల్యే మాధవమ్మ నియోజకవర్గ ప్రజలకు అందు బాటులో ఉంటూ సంక్షేమంతో పాటు గత పాలకులు నిర్లక్ష్యం చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై ద్రుష్టి సారించారని అన్నారు. అలాగే విమానాశ్ర నిర్వాసితుల సమస్యలను గురించి విమానయాన శాఖ మంత్రి రామ్మోహనాయుడుకు వివరించారని తెలిపారు. అందరికి న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు. ఈ కార్య క్రమంలో వరుపుల సుధాకర్, గుండపు సూరి బాబు, పల్లా రాంబాబు, పల్లంట్ల జగదీశ్, బొల్లు త్రినాథ్, మాత నవీన్,శిరుగుడి వెంకటేష్, గుండపు నానాజీ, జక్కాపు రవి, ఆళ్ళ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి బొత్స సత్యన్నారాయణకు శుభాకాంక్షలు చెప్పిన మాజీ ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : మాజీ మంత్రి బొత్స సత్య నారాయణకు పుట్టిన రోజు శుభాకాంక్షలను మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ జిల్లా మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు మంగళవారం తెలియజేసారు. మాజీ మంత్రి బొత్సను మర్యాదపూర్వకంగా మాజీ ఎమ్మెల్యే కడుబండి కలిసి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రాభివృద్ధికి పాటుపడతాం

అభినందన సభలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయింది. రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇలా అందరం రాష్ట్రాభివృద్ధికి పాటుపడతామని, అలాగే టీడీపీ అఖండ విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తోడుగా ఉంటామని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్పష్టం చేశారు. విశాఖపట్నం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఏర్పాటు చేసిన అభినందన సభలో శృంగవరపుకోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఒక దానికి ఒకటి పోటీ పడేలా ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ

విశాలాంధ్ర - గుర్ల : వసతి గృహాలలో విద్యార్థినుల ఆరోగ్య, వసతి, విద్య, మౌలిక వసతులు ప్రభుత్వం సూచనల ప్రకారం సక్రమంగా అందించాలని మెనూ ప్రకారం ఆహారం అందించాలని గుర్ల కస్తూరి బా గాంధీ బాలికల విద్యాలయం లోని జరిగిన న్యాయ అవగాహనా సదస్సులో కె. విజయ కళ్యాణి, సీనియర్ సివిల్ జడ్జి మరియు కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, విజయనగరం వారు పాల్గొని ప్రసంగించిరి ఈ రోజు కేజీబీవీ ని పర్యటించి ఆహారం, వసతి, పారిశుద్యం, స్టోర్ రూమ్ మరియు తరగతి గదులను తనిఖీ చేసిరి, విద్యార్థినులను మెనూ మరియు వసతులను గురించి ఆరా తీసిరి, విద్యార్థినులను ఉద్దేశించి రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 ప్రకారం విద్య ప్రాథమిక హక్కు అని, దీని ప్రకారం మీరు అందరు బాగా చదువు కొని తల్లిదండ్రులకు, స్కూల్ కి మంచి పేరు తేవాలని అన్నారు సెల్ ఫోన్‌కి ఎడిక్ట్ కావద్దని హితవు పలికిరి, టెక్నాలజ్జి మీద నాలెడ్జి పెంచు కోవాలని టెక్నాలజీ మంచికి ఉపయోగించుకోవాలని చెప్పిరి, యోగ మెడిటేషన్ చెయ్యాలని విటీవలన శారీరక మానసిక బలం మరియు ఏకగ్రత పెరుగుతుందని చెడు వ్యసనములకు బానిసకారాదాని పేర్కొనిరి, స్కూల్‌ని అంతయు సందర్శించి, రికార్డ్స్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేసిరి, సదస్సుకు ముందు స్కూల్ పిల్లలు స్కోట్స్ అండ్ గైడ్ క్యాడట్స్ చె జడ్జి గారికి గౌరవవందనం చేసిరి మరియు విద్యార్థినులు యోగ మరియు పిరమిడ్స్ చేసిరి గౌ శ్రీ ఎస్.భాస్కర్‌రావు గుర్ల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ మాటల్లో పిల్లలు చెడుకు దూరంగా ఉండాలని విద్య పై శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శ్రీ కె. వి. రమణ, ఎంపీడీఓ బి. వెంకట రమణ, డిప్యూటీ తహసీల్దార్ ఆర్. శంకర్ రావు, గుర్ల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్.భాస్కర్‌రావు -1 శ్రీ ఎస్.భాను ప్రకాష్, -2, ఎమ్.శ్రీనివాసు రావు స్కూల్ మరియు కళాశాల టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్కూల్ సిబ్బంది, విద్యార్థినులు, పోలీసుసిబ్బంది, జిల్లా న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి బొత్సకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

విశాలాంధ్ర - గజపతి నగరం : మాజీ మంత్రివర్యులు బొత్స సత్యనారాయణ (సత్తిబాబు) కు మంగళవారం ఆయన పుట్టినరోజు సంద ర్భంగా విశాఖలో మర్యాద పూర్వకంగా ఆయనను కలిసి గజపతినగరం జడ్పిటిసి గార తవుడు వైసిపి నాయకులు బెల్లాన త్రినాధరావు పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పైడితల్లమ్మకు విశేషాలంకరణ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీ పైడితల్లమ్మ వారికి మంగళవారం చదురు వనం దేవాలయాలలో పంచామృతాభిషేకం కుంకుమార్చన నిర్వహించి విశే షాలంకరణ చేశారు. అనంతరం పూజారి ధనుంజయ చేయించిన నైవేద్యాన్ని సమర్పించారు. మంగళవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో దర్శించుకునేందుకు దేవాలయాల వద్దకు భక్తులు ఉదయం నుండే విచ్చేశారు. ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వహణ అధికారి డివి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సమీపంలో చర్యలు చేపట్టారు. అనంతరం ప్రతిరోజు వలె అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నీటి పన్ను బకాయిలను ఉపేక్షించేది లేదు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నీటి పన్ను బకాయిలను ఉపేక్షించబోమని నగర పాలక సంస్థ ఈఈ కే.శ్రీనివాస రావు అన్నారు. దీర్ఘకాలంగా నీటి పన్ను చెల్లించని వినియోగదారుల కుళాయిలను నిలుపుదల చేస్తామని స్పష్టం చేశారు. కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశాల మేరకు మంగళ వారం 31వ నెంబర్ సచివాలయం పరిధిలో నీటి బకాయి పేరుకుపోయిన వినియోగదారుని కుళాయి కనెక్షన్ ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఈఈ కే శ్రీనివాసరావు మాట్లాడుతూ నీటి పంపిణీకి ఎంతో వ్యయ, ప్రయాసలు అవుతోందని, అట్టి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ నీటి వినియోగదారులు తప్పనిసరిగా సకాలంలో పన్నులను చెల్లించాలని అన్నారు. లేని పక్షంలో నీటి సరఫరాను నిలుపుదల చేస్తామని తెలిపారు. నీటిని వృధాగా చేయకుండా ఆన్ ఆఫ్ స్విచ్ లను తప్పనిసరిగా వినియోగించాలని అన్నారు. నీటి వినియోగాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ అంబేద్కరును సత్కరించిన ప్రజాసంఘాలు

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : జిల్లాలో గల వివిద ప్రజా సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబద్కర్ ను మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిపుష్పగుచ్చం ప్రజా విజయం పుస్తకం, దళిత హక్కుల పోరాట సమితి దైనందినిని అందజేశారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గోకా రమేష్ బాబు మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మైనింగ్, ప్రభుత్వ చెరువులు బూ కబ్జాలు మరియు వివిధ పాఠశాలలో మధ్యాహ్న బోజన పథకం సక్రమ అమలును జిల్లాలో సక్రమంగా అమలు జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా విజయం అధ్యక్షులు పుక్కెళ్ల షణ్ముఖ రావు, సంతోష్, అయినాడ కృష్ణ, నాయిబ్రహ్మన్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వి. దుర్గారావు, నాయకులు పప్పు విశ్వనాథం, కార్మిక నాయకులు రెడ్డి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎం.వి.జి.ఆర్ డేటా ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

విశాలాంధ్ర - డెంకాడ : డిపార్ట్‌మెంట్ ఆఫ్ డేటా ఇంజనీరింగ్, ఎం.వి.జి.ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఏ), విజయనగరం ఇంటెలిజెంట్ సైబర్-ఫిజికల్ సిస్టమ్స్ టెక్నాలజీ రీసెంట్ ట్రెండ్స్ అండ్ అప్లికేషన్స్ (ఐ సి పి ఎస్-భారత-2024)"పై డి.ఎస్.టి- సెల్ఫ్ స్పాన్సర్ చేసిన 1 వారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. సోమవారం జరిగిన ఈ 1 వారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభోత్సవ కార్యక్రమానికి శ్రీ మల్లెలు సాయి ప్రశాంత్, బ్లాక్‌చెయిన్ సీనియర్ డెవలపర్, యాయిన్ ఏ.ఐ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్, ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సాయి ప్రశాంత్ మాట్లాడుతూ బ్లాక్ చైన్ టెక్నాలజీ రంగంలో సంచల నాత్మక ఆవిష్కరణలు, పురోగతిపై చర్చించారు. ఈ రకమైన ఎఫ్.డి.పి.లను నిర్వహించడం వల్ల విద్యార్థులు మరియు అధ్యాపకులు బ్లాక్ చైన్ టెక్నాలజీపై అత్యాధునిక లైవ్ ప్రాజెక్ట్‌లు మరియు ఒక కస్టమర్ మరియు కంపెనీ లేదా రెండు కంపెనీల మధ్య కస్టమర్ డేటాను పంచుకోవడంలో భద్రత మరియు పారదర్శకతను పెంచడం వంటి వివిధ రంగాలలో దాని అప్లికేషన్‌లను తెలుసుకునే మరియు అర్థం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుందని ఆయన అన్నారు. డాక్టర్ పి.శ్రీనివాసరావు (కన్వీనర్-ఎస్‌టిటిపి) మాట్లాడుతూ, ఈ ఎఫ్‌డిపి నుండి పాల్గొనేవారు ప్రయోగాత్మక వర్క్‌షాప్‌లు, ప్రాక్టికల్ సెషన్‌లు మరియు తోటివారితో మరియు రంగంలోని నిపుణులతో నెట్‌వర్కింగ్ అవకాశాల నుండి ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. జి. రేణు, కో, కాన్ ప్రోకాంగో ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నం , ప్రవీణ్ కుమార్ సింగ్, సీనియర్ డేటా సైంటిస్ట్, ఎక్స్టర్నల్ ఎనాలిటిక్స్ నోడియా మరియు డాక్టర్ దర్శాల్ మల్లికార్జున్ డ్డి ట్రిబుల్ ఐటీ శ్రీ సిటీ ఆంధ్ర ప్రదేశ్ కూడా ఈ 1 వారం ఎఫ్‌డిపి ప్రోగ్రామ్‌పై ఉపన్యాసాలు ఇవ్వడానికి ఆహ్వానించబడ్డారు. సుమారు 70 మంది ఫ్యాకల్టీ పార్టిసిపెంట్స్ మరియు రీసెర్చ్ స్కాలర్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ డీన్ డా. వి.నగేష్, డా. పి.సతీష్, (ఎఫ్.డి.పి ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్), అసోసియేట్ ప్రొఫెసర్, హెచ్.ఓ.డి-డి.ఇ, డేటా ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఆపదలో ఉన్నవారికి అత్యంత అవసరమైన రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని విజయనగరం రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, ఆర్.శంకరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రోటరీ నూతన కార్యవర్గం భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పట్టణంలోని ప్రయివేటు ఆసుపత్రిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని ప్రారంభించిన వీరు మాట్లాడుతూ రక్తదానం పట్ల అపోహలు వీడాలని, రక్తదానం చేసిన వ్యక్తి చురుకుగా, ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. రక్త నిధి కేంద్రాల్లో రక్తం నిల్వల కొరతను అధిగమించేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒక వ్యక్తిని బతికించే శక్తి రక్తదాతకు మాత్రమే ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు యువత రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డి.ఉమాబాలాజీ, ప్రతినిధులు అరుణ్ కుమార్ సొధాని, జి.శివ కుమార్, జయకృష్ణ, టి.ఎల్.ఎన్.మూర్తి, వి.వి.రాజేష్, బత్తుల చంద లతో పాటు రోటరీ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత కంటోన్మెంట్ గూడ్స్ షెడ్డు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలు సమకూర్చారు. మొక్కలు నాటారు.

నేర నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్

విశాలాంధ్ర - రాజాం : నేర నియంత్రణ కొరకు రహదారి ప్రమాదాల నివారణకు రాజాం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. రోజూ ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ, వారితో మమేకం కావాలని సిబ్బందికి రాజాం పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ దాడి.మోహన్ రావు సూచించారు. విజిబుల్ పోలీసింగ్ సమయంలో రద్దీ ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు, అనుమానితులను గుర్తించి విచారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవి కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ విమానాశ్రయాలకు దీటుగా భోగాపురం విమానాశ్రయాన్ని నిర్మిస్తాం

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

విశాలాంధ్ర - భోగాపురం : అంతర్జాతీయ విమానాశ్రయాలకు దీటుగా భోగాపురం విమానాశ్రయాన్ని నిర్మిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నిర్మాణంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు . ఎయిర్ పోర్ట్ టెర్మినల్, రన్ వే తదితర నిర్మాణాలను, జాతీయ రహదారితో విమానాశ్రయ అనుసంధాన రహదారిని ఆయన పరిశీలించారు. విమానాశ్రయ నిర్మాణ పనులను గురించి జి.ఎం.ఆర్. సంస్థ ప్రతినిధులు ఆయనకు వివరించారు. విమానాశ్రయ భూ సేకరణ అంశాలపై జిల్లా కలెక్టర్ డా బి ఆర్ అంబేద్కర్ రామ్మోహన్ నాయుడుకు వివరించారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర శరవేగంగా అభివృద్ధి చెందడానికి గుండెకాయ వంటి ఈ విమానాశ్రయాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టి 2026 నాటికీ నిర్మాణం పూర్తీ చేస్తామని అన్నారు. ఉత్తరాంధ్రలో అభివృద్ధికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. ఈ విమానాశ్రయ నిర్మాణం జరిగితే 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. విమానాశ్రయ ప్రారంభమైతే సంవత్సరానికి సుమారు 50 లక్షలు మంది ప్రయాణిస్తారని అన్నారు. ఏవియేషన్ కు సంబంధించి అన్ని విభాగాలు ఇక్కడ నెలకొల్పుతామని పేర్కొన్నారు. గత కబ్జాల ప్రభుత్వం 500 ఎకరాలను ఎందుకు ప్రక్కన పెట్టిందో తెలియదని, ఇప్పుడు ఆ 500 ఎకరాలు ప్రజలకు ఉపయోగపడేలా ప్రణాళిక చేస్తామని అన్నారు. వచ్చే గురువారం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తో విమానాశ్రయం సందర్శిస్తారని తెలిపారు. విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలను స్థానిక నాయకులతో కలసి చర్చించి పరిష్కరిస్తామని అన్నారు. ఈ పర్యటనలో ఎం.పి. కలిసెట్టి అప్పల నాయుడు, శాసన సభ్యులు లోకం నాగ మాధవి, అదితి విజయలక్ష్మి గజపతిరాజు, టిడిపి ఇంచార్జి బంగార్రాజు జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొత్స జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - మెరకముడిదాం : మెరకముడిదాం మండలం చినభంటుపల్లి గ్రామంలో మంగళవారం నాడు రాష్ట్ర మాజీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ 67వ జన్మదిన వేడుకలును మండల వైసీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బొత్స జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ ను మండల వైసీపీ నాయకులు కోట్ల వెంకటరావు, శిరువూరి వెంకటరమణ రాజు, టి.వేణుగోపాల రావులు కట్ చేశారు. అనంతరం అనంతరం కేక్ లు పంచుకొని ఒకరికి ఒకరు తినిపించుకొని బొత్స జన్మదిన వేడుకలును ఘనంగా జరుపుకున్నారు. ఈ జన్మదిన వేడుకల్లో మండల వైస్ ఎంపిపి టి.హరిబాబు, వైసీపీ నాయకులు పప్పల కృష్ణమూర్తి, కర్రోతు నాగేశ్వర రావు, కె.శివరామకృష్ణ ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, షూస్ బెల్ట్‌లు పంపిణీ

విశాలాంధ్ర - చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణం బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన స్కూల్ బ్యాగ్‌లు, షూస్, బెల్ట్‌లను జడ్పిటిసి ప్రతినిధి వైయస్సార్సీపి కార్యదర్శి వలే రెడ్డి శ్రీనివాస్ నాయుడు విద్యార్థులకు పం పిణీ. చేశారు. ఈ సందర్భంగా వలిరెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చారు అని తెలిపారు, ఇంగ్లీష్ మీడియం, మధ్యాహ్నం భోజనం, నాడు నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి, 8వ తరగతి విద్యార్థులుకు ట్యాబులు ఇలా విద్యార్థినీ విద్యార్థులకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేసారు అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో చీపురుపల్లి బాయ్స్ హై స్కూల్‌లో ఫస్ట్ (ఆర్టిఫిషల్ ఇంటిలిజెంట్) టెక్నాలజీ ల్యాబ్ పెట్టారు అని విద్యార్థులు అందరూ గర్ల్స్ స్కూల్ విద్యార్థులు కూడా దీన్ని ఉపయోగించుకోవాలని ఆయన విద్యార్థులను కోరారు. పాఠశాల లో ఏ సమస్యలు వున్న తప్పకుండా పరిష్కారం కోసం మేము ఎప్పుడు కృషి చేస్తామని తెలిపారు మాజీ ముఖ్య మంత్రి వై యెస్ జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థ లో తెచ్చిన ఈ విప్లవత్మక మార్పులు ఈ ప్రభుత్వం కూడా కొనసాగించాలని ఆయన కోరారు, కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రతినిధి, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు,యువజన ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీ, పట్టణ పార్టీ అధ్యక్షులు పతివాడరాజారావు ఎంపీటీసీ ప్రతినిధులు కోరుకొండ దాలయ్య, కోసిరెడ్డి రమణ హై స్కూల్ ప్రధానోపాధ్యాయిని రహీన బేగం, వార్డ్ మెంబెర్స్ కర్ణపు ఆదినారాయణ, మహంతి లక్ష్మి, ఇప్పిలి కృష్ణ, మహంతి లక్ష్మణ,బలగ రమేష్ స్కూల్ చైర్మన్ మీసాల సీతారామ్, ప్రభాత్ కుమార్ నాగచైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీపురుపల్లి మండల కార్యాలయంలో మాజీ మంత్రి బొత్స జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో మాజీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు ను చీపురు పల్లి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత వైభవో పేతంగా ఘనంగా నిర్వహించారు.మాజీ మంత్రి బొత్స జన్మదిన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ కేక్ ను విజయనగరం మాజీ ఎంపీ బెల్లం చంద్రశేఖర్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు.. మీ సందర్భంగా భారీ ఎత్తున బాణాసంచా పేల్చారు. అనంతరం మండల కార్యాలయం నుంచి స్థానిక రావివలస మార్గంలో గల శ్రీ బాపూజీ వృద్ధాశ్రమం నందు వృద్ధులకు పళ్ళు రొట్టెలు పంపిణీ చేశారు.. అలాగే చీపురుపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యాలయంలో ఇటీవల చీపురుపల్లి శాసనసభ్యుడిగా ఎన్నికైన కిమిడి కళా వెంకట్రావు జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ అత్యంత వైభవపీతంగా నిర్వహించిన సంగతి పాఠకులకు విధితమే. చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకట్రావు జన్మదిన వేడుకలకు దీటుగా అదే ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణము నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం కోసమెరుపు.. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లం చంద్రశేఖర్ తోపాటు జడ్పిటిసి వలిరెడ్డి శిరీష, మండల అధ్యక్షురాలు ఇప్పిలి వెంకట నరసమ్మ చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, దేవర ఉమా కుమారి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వల్లి రెడ్డి శ్రీనివాస నాయుడు. మాజీ జెడ్పిటిసి మీసాల వరహాలు నాయుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రతినిధి బెల్లాన్ వంశీ. దన్నాన జనార్ధన రఘు మండ త్రినాధరావు అధి కారుల శ్రీనివాసరావు. బాణాల శ్రీనివాసరావు పాంద్రంకి రాము మీసాల ఈశ్వరరావు చందక శ్రీనివాస రావు చీపురుపల్లి మండల వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

జామి ఇంటర్ కళాశాలకు 5గురు ఫ్యాకల్టీ మంజూరు

విశాలాంధ్ర - జామి : ఈఏడాదినుంచి ప్రారంభమైన జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలోని ప్లస్‌టూ ఇంటర్ తరగతుల భోదనకు ప్రభుత్వం 5గురు ఫ్యాకల్టీని నియమించింది. ఇంటర్ కళాశాలల్లో ఫ్యాకల్టీ ఇబ్బందులను గుర్తించి విద్యాశాఖ ఆర్‌జెడి ఈమేరకు నియామకాలను చేపట్టారు. వివిద ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇంటర్ తరగతుల భోదనకు నియమించారు. అందులో భాగంగా జామి ఇంటర్ కళాశాలలో ఈఏడాది ఎంపిసి, సిఇసి గ్రూపులు మాత్రమే నడుస్తున్నాయి. దీంతో కామర్స్, సివిక్స్, తెలుగు, ఎకనామిక్స్, ఇంగ్లీస్‌ల సబ్జెక్ట్‌లకుగాను భోదకులను నియమించారు. ఈమేరకు మంగళవారం డిఇవో ప్రేమ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు.

పెళ్లి చేసుకుంటానని మోసగించిన వ్యక్తికి పదేళ్లు జైలు శిక్ష

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణం, గుడారి వీధికి సంబంధించిన సర్వసిద్ధి వెంకటేష్ సన్నాఫ్ అప్పలరాజు, 30 సంవత్సరాలు అనే వ్యక్తి, బొబ్బిలి పట్టణం గొల్లపల్లి , దాడితల్లి కాలనీకి చెందిన 25 సంవత్సరాలు గల ఒక మహిళ ని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ప్రేమిస్తున్నానని చెప్పి, శారీరకంగా లొంగదీసుకుని, తరువాత పెళ్లికి నిరాకరించడంతో, తేదీ 7.7.2016 న బొబ్బిలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, అప్పటి సీఐ వై. రవి బొబ్బిలి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 279/2016 సెక్షన్ 417, 376 ఐపిసి కింద కేసు నమోదు చేశారు . అనంతరం దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు .తదుపరి విచారణ చేపట్టిన మహిళా కోర్టు మరియు అడిషనల్ సెషన్స్ కోర్టు వారు సాక్షులను విచారించి నేరం నిరూపణ అయినందువలన సదరు ముద్దాయికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు 30 వేల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎన్. పద్మావతి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా రఘురాం వ్యవహరించారు.. అలాగే సకాలంలో సాక్షులను ప్రవేశపెట్టి కేసుకు సహకరించిన హెడ్ కానిస్టేబుల్, సిహెచ్. స్వామి నాయుడు ని బొబ్బిలి పోలీస్ స్టేషన్, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, . ఎం. నాగేశ్వరావు అభినందించారు..

మహిళలకు లైంగిక వేదింపుల చట్టంపై అవగాహన ఉండాలి

సదస్సులో తహశీల్దార్ రాంబాయి వెల్లడి

విశాలాంధ్ర - జామి : ప్రస్తుతం సమాజంలో పనిచేసే మహిళలు ఎక్కువగా ఉన్నారని, వారిలో అనేకమంది ఆయా పని ప్రదేశాలలో లైంగికంగా అనేక ఇబ్బందులు గురవుతున్నా బైటకు చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారని తహశీల్దార్, మండల మెజిస్ట్రేట్ జి. రాంబాయి అన్నారు. మంగళవారం ఐసిడిఎస్ ఎస్‌కోట క్లస్టర్ ఆద్వర్యంలో స్థానిక ఎంపిడివో కార్యాలయంలో మహిళలపై లైంగిక వేదింపులు చట్టంపై అవగాహనా నదస్సును నిర్వహించారు. జామి సెక్టార్ సూపర్‌వైజర్ డి..సునీత అధ్యక్షతన జరిగిన ఈసదస్సులో ముఖ్యఅతిధిగా హాజరైన తహశీల్దార్ మాట్లాడుతూ చట్టంకు సంభందించిన పలు అంశాలను విపులంగా తెలియజేసారు. అలాగే ప్రతీ శాఖలోనూ ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆడపిల్లలకు పాఠశాలలోనూ, కళాశాలలోనూ, ఉద్యోగ ప్రదేశాలలోనూ, కూలిపనులు చేసే సమయంలోనూ అనేక విదాలుగా అసభ్య ప్రచారాలు చేసే వారిపై ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎంపిడివో వి. తిరుమల రావు మాట్లాడుతూ మహిళలు నేడు పురుషులకన్నా తక్కువ కాదని అనేక విదాలుగా నిరూపించుకున్నారని, ఎక్కడైనా వేదింపులు ఎదురైతే వెంటనే ఎదురు తిరగాలని సూచించారు. ఉద్యోగాలలో ఉన్నవారు సాయంత్రం ఉద్యోగ సమయం ముగియగానే వెళ్ళిపోవాలన్నారు. ఆడపిల్లల పట్ల నేడు తండ్రులు ఎంతో ప్రేమాభిమానాలు కనబరుస్తున్నారని వివరించారు. ఈసదస్సులో ఇవోపిఆర్‌డి పి. శ్రీదేవి, కార్యాలయ ఎవో నరసింహం,ఎన్‌జివో ప్రతినిధి సతీష్‌తోపాటు మండలంలోని వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖల అధికారులు అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదు : ఎమ్మెల్యే కళావెంకట్రావు

విశాలాంధ్ర - చీపురుపల్లి : చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు హౌసింగ్ విభాగం అధికారులతో మంగళ వారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కళా వెంకటరావు హౌసింగ్ అధికారులతో సమీక్ష జరిపారు . చీపురుపల్లి నియోజకవర్గంలో ప్రాసెస్ లో ఉన్న1332 ఇండ్లు ను పూర్తి చేసి, కొత్త ఇండ్లు కు డిసెంబర్ నెలలో ఆదేశాలు జారీ చేయా లని అధికారుల ఆదేశించారు. అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కిమిడి అన్నారు. ఇళ్ళ విషయంలో అవినీతికి పాల్పడిన ఎవరిని ఉపేక్షించబోమని,అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వాలనీ ఇల్లులేని పేదవారు ఎవరు ఉండకూడదని ఎమ్మెల్యే కళావెంకటరావు అధికారులు ఆదేశించారు. చీపురుపల్లి నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా హౌసింగ్ డిపార్ట్ మెంట్ లో జరిగిన కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పి.డి వి శ్రీనివాస్ చీపురుపల్లి డి.ఈ బి.వి రమణ రాజు పాల్గొన్నారు.

విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో ప్రజలు విష జ్వరాలు రాకుండా నివారించడానికి జాగ్రత్తలు పాటించేలా మండల స్థాయి వైద్య అధికారులు అవగాహన కల్పించాలి అని జిల్లా స్థాయి మెడికల్ అధికారి డిఎమ్‌డిహెచ్‌ఓ భాస్కరారావు హెల్త్ సిబ్బందికి సూచించారు. ప్రతి గ్రామం లో ఇలాంటి టైర్లు వర్ష కాలం లో ఇలా ఉన్నట్లు అయితే వాటిల్లో డెంగ్యూ, మలేరియా దోమలు వేల సంఖ్య ల్లో గుడ్లు పోసి అవి దోమలుగా మారి ప్రజలకు కుట్టి తీవ్రమయినా అనారోగ్యానికి గురి చేస్తాయి అని అన్నారు. ప్రతి గ్రామం లో ఇలాంటి టైరలు కానీ, తాగి పారేసిన కొబ్బరి బొండాల్లో కానీ, ప్లాస్టిక్ డొక్కుల్లో కానీ నెలలు తరబడి నీరు నిల్వ ఉండకూడదు అని, అలాగే గ్రామాల్లో సిసి కాలువాల్లో పరిశుభ్రం గా ఉంచాలి అని అన్నారు. ఇటువంటి చెత్త వర్గాల్లో నీరు నిల్వ ఉన్నట్లు అయితే టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ లాంటి దోమలు లేకుండా ఈ వర్ష కాలంలో ప్రతి గ్రామం లో పరిశుభ్రం గా ఉంచేటట్లు చూసుకోవాలి అని అలాంటప్పుడు ప్రజలను జ్వరాలు బారిన పడకుండా కాపాడగలమణి తెలిపారు. గ్రామాల్లో జ్వరాలు వచ్చేటప్పుడు ప్రభుత్వ హాస్పిటల్ లో మంచి మంచి మెడిసన్ అందుబాటులో ఉంటుంది అని, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి టెస్టులు చేసుకునే ల్యాబ్ లు ప్రభుత్వ హాస్పిటల్ లో అందుబాటులో ఉంటాయాని, ఆర్ ఎమ్ బి డాక్టర్ లు ను నమ్మి వేలకు వేల రూపాయలును ఖర్చు పెటవు కోవద్దని, మీకు కావలసిన అన్ని రకాల మెడికల్ సౌకర్యలను రూపాయి ఖర్చు లేకుండా గవర్నమెంట్ మీకు ముందులు అందిస్తుంది అని, ఈ విష్యం మీరు అవగాహన చేసుకొని గవర్నమెంట్ హాస్పిటల్ లో వైద్య సేవలు వినియోగించుకోవాలని డిఎమ్‌డిహెచ్‌ఓ భాస్కారరావు ఒక ప్రకటనలో ప్రజలను కోరారు.

ఎరువుల దుఖాణాలపై విజిలెన్సు తనిఖీలు

విశాలాంధ్ర - జామి : రాష్ట్ర వ్యవసాయశాఖ కమీషనర్ ఆదేశాల మేరకు గత 5రోజులుగా అన్ని మండలాలలో విజిలెన్సు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా ఎరువుల దుఖాణాలలో తనిఖీలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం జామిలోని వెంకట రామకృష్ణ మర్చంట్స్ దుఖాణాన్ని విజిలెన్సు అధికారులు ఆర్. గంగాధరరావు, ఎస్.తాతారావుతోపాటు ఎవో కిరణ్‌కుమార్ సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, పురుగుల మందులు, వాటి కాలపరిమితి, గోదాములలోని నిల్వలు, రికార్డులు, అనుమతులు, రిజిస్టర్ నిర్వహణ తదితరఅంశాలను అధికారులు పరిశీలన చేసారు. అంతా సవ్యంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేసారు. –ఖీలలో వ్యవసాయ సిబ్బంది అహ్మద్, శివ పాల్గొన్నారు.

కెఆర్.సూర్యనారాయణపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : కె.ఆర్ సూర్యనారాయణ పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ మంగళవారం ఏపిజిఈఏ అధ్యక్ష కార్యదర్శులు కంది వెంకట రమణ, బి.బాలభస్కరరావు ఆధ్వర్యంలో యూత్ హాస్టల్ వద్ద జిల్లా కార్యవర్గ సమావేశం అనంతరం, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టి డి ఆర్‌ఓఎస్‌డి అనితకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కంది వెంకటరమణ బి.బాలభాస్కరరావు మాట్లాడుతూ ఏపిజి ఈఏ రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ పై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు న్యాయం చేసే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పువ్వల శ్రీనివాసరావు, అర్బన్ అధ్యక్ష కార్యదర్సులు చింతల వెంకట సతీష్, బియ్యాల చంద్ర శేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ పాణిగ్రాహి, పీఆర్ అనిల్ కుమార, ఎన్ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీలు లెంక సత్తిబాబు, పి.మేరీ, రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వి యుగంధర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం పేదలకు రేషన్ షాపుల ద్వారా ఇస్తానన్న కంది పప్పు ఈ నెల సరాఫరా లేనట్లేనా : లోక్ సత్తా

విశాలాంధ్ర - బొబ్బిలి : రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు దారులకు జూలై నెల నుండి కంది పప్పు ఇస్తాం అని ప్రకటన చేసారు. అయితే ఈ నెల కేవలం బియ్యం మాత్రమే ఇచ్చి సరి పెట్టేసారని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు అన్నారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బియ్యం, చక్కెర, గోధుమ పిండి, కంది పప్పు తెల్ల రేషన్ కార్డు దారులకు ఇచ్చే వారు. అయితే సంవత్సరం నుండి కంది పప్పు ఇవ్వడం మానేసి కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఇచ్చే వారు. కనీసం పండగలప్పుడు కూడా కంది పప్పు ఇచ్చే ఏర్పాటు చెయ్య లేదని. అయితే ఈ విషయం ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లగా జూలై నెల నుండి కంది పప్పు పంపిణీని తిరిగి ప్రారంభిస్తున్నట్టు అందుకు తక్షణమే పంపిణీకి చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు పత్రికలలో కథనాలు వచ్చాయని తెలిపారు. అయితే ఈ నెల కేవలం బియ్యం మాత్రమే ఇచ్చి చక్కెర కూడా ఇవ్వలేదు. దీనివల్ల లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డీలర్లను అడుగగా కేవలం బియ్యం మాత్రమే వచ్చాయి అని చెబుతున్నారు. అసలు ఇంతకీ కంది పప్పు ఈ నెల ఇస్తారా. ? లేదా? అయితే ఏ నెల నుండీ ఇస్తారో? అధికారులు పత్రికా ముఖంగా తెలియజేయాలని కోరారు. తెలియజేస్తే ప్రజలకు తెలుస్తుంది కదా. రాగులు కూడా ఇస్తాం అని ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు దారులకు ఏ....ఏ సరుకులు ఏ నెల నుండి పూర్తి స్థాయిలో ఇస్తారో ప్రజలకు తెలియజేయాలని లోక్ సత్తా పార్టీ తరపున విజ్ఞప్తి చేశారు. బయట బజారులో కిలో కంది పప్పు 180 రూపాయలకు పైగా ఉంది. గత ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు దారులకు కిలో కంది పప్పు 67 రూపాయలకు ఇచ్చేవారు. దీనివల్ల పేద ప్రజలకు కొంత వెసులు బాటు ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం కూడా వెంటనే చొరవ చూపి కంది పప్పు పంపిణీ చేస్తామనడం మంచి పరిణామం. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. నేను లోక్ సత్తా పార్టీ తరపున విజ్ఞప్తి చేసేదేంటంటే గతంలో తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నపుడు తెల్ల రేషన్ కార్డు దారులకు దాదాపు పదకొండు రకాల నిత్యావసర సరుకులు ఇచ్చేవారు. దీని వలన పేద ప్రజలకు నిత్యావసర సరుకుల భారం కాస్త తగ్గింది. తిరిగి అవే సరుకులు లబ్దిదారులకు ఇవ్వాలని కోరారు. పండగలప్పుడు ఇచ్చే కానుకలు ఇచ్చే ఏర్పాటు చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

సరైన రహదారి సౌకర్యాలు లేకుండానే భాష్యం స్కూల్‌కి అనుమతులు మంజూరు రా.....?

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణం అభ్యుదయ స్కూల్ సందు , చర్చి రోడ్ల గల భాష్యం హైస్కూల్ కు వాహనాలు రాకపోకలు చేయడానికి అనుకూలంగా రహదారి సౌకర్యం లేకపోయినా సంబంధిత శాఖ అధికారులు స్కూలు నిర్వహణకు ఏ విధంగా అనుమతుల మంజూరు చేశారని విద్యార్థులు తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జరగరాని సంఘటన జరిగితే నివారణకు స్కూల్ లోకి ఫైర్ ఇంజన్ వాహనం వెళ్లడానికి సరైన రహదారి సౌకర్యం లేదు. స్కూలు పక్కనే విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఉండడంతో ప్రమాదంలో జరిగే అవకాశాలు ఉన్నాయని విద్యార్థులు తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భాష్యం స్కూల్లో విద్యార్థులకు సరిపడినన్ని మరుగుదొడ్లు సౌకర్యం లేదని మరుగుదొడ్ల నిర్వహణ కూడా యాజమాన్యం సక్రమంగా నిర్వహించడం లేదని విద్యార్థులు నుండి ఆరోపణలు ఉన్నాయి. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేపట్టి భాష్యం స్కూలు నిర్వహణలో ట్రాఫిక్ అగ్నిమాపక మున్సిపల్ విద్యార్థులకు ఆట స్థలం విద్యార్థులకు క్రీడా సామాగ్రి, మరుగుదొడ్ల సదుపాయం, అధిక ఫీజుల వసూలు తదితర అంశాల పైన ప్రత్యేక దర్యాప్తు చేపట్టి విద్యార్థుల మౌలిక వసతులు కల్పనకు తగు చర్యలు చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు ప్రజలు కోరుతున్నారు.